పైసలు ఎప్పుడు ఇస్తారు?

- బ్యాంకు వద్ద రైతుల ఆందోళన


ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న రైతులు

లింగంపేట: వడ్ల పైసలు ఎప్పుడు ఇస్తారని పలు గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్ ఆర్యరాజ్‌ను నిలదీశారు. వడ్ల పైసల కోసం బ్యాంకుకు వెలితే క్రాప్ లోన్ పట్టుకొని మిగతా డబ్బులు ఇస్తామని బ్యాంకు మేనేజర్ వేధిస్తున్నాడని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పర్మళ్ల, లింగంపల్లి, బోనాల్, రాంపల్లి, బోనాల్ తండా, సురాయిపల్లి, మోతె గ్రామాలకు చెందిన రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు చైర్మన్, లింగంపల్లికి చెందిన గ్రామ పెద్ద కాశీరాంను వెంటబెట్టుకొని బ్యాంకుకు వెళ్లారు. దాన్యం డబ్బులు రైతులకు ఎందుకు ఇవ్వడంలేదని వారు మేనేజర్‌ను ప్రశ్నించారు. తనను అండమాన్ నికోబార్‌కు బదిలీ చేయించు కొండి అంటూ హేళనగా మాట్లాడారు. దాంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాన్యం డబ్బులు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ తమ ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నావు అంటూ నిలదీశారు. బోనాల్ తండాకు చెందిన గణేస్ అనే రైతు ఖాతాలో రూ. 78 వేలు ఉండగా అకౌంట్ ఫ్రీజ్ చేశాడని ఆందోళన వ్యక్తం చేశాడు. డబ్బులు ఇవ్వమని బ్యాంకు చుట్టూ తిరుగుతుంటే ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ దబాయించినట్లు తెలిపారు. మేనేజర్ వ్యవహారంపై ఎల్లారెడ్డి ర్డీవోకు పిర్యాదు చేశారు. పంట రుణం కావాలంటే బ్రోకర్లను ఆశ్రయించాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్ష రుణం ఇస్తే రూ. 25 వేలు సమర్పించు కోవాల్సిందేనని ఆరోపించారు.

కురుమల సంక్షేమానికి సీఎం ప్రాధాన్యత


గంప గోవర్ధన్‌ను సన్మానిస్తున్న నాయకులు

కామారెడ్డి రూరల్: గొల్ల, కురుమల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన కురుమ సంఘం భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. దీంతో కురుమ కులస్తులు పెద్ద ఎత్తున గంప గోవర్ధన్ ఇంటికి వచ్చి గొంగడి కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గొల్ల, కురుమలకు 75 శాతం సబ్సిడీతో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టి ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం ప్రతినిధులు నాగల్ల రాజేందర్, దొడ్లె మల్లయ్య, మినాయి రాజయ్య, దొడ్లె మల్లేష్, వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, నాగల్ల స్వామి, దర్శపు రమేష్, చెట్కూరి ప్రవీణ్, మర్కంటి శ్రావణ్, బండారి రవి, నాగల్ల బీరయ్య, దొడ్లె చిన్నసాయిలు, నాగల్ల మహేష్, బండారి బీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



లింగంపేట: మండలంలోని పలువురు లబ్దిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ పథకం చెక్కులను ఎమ్మెల్యే జాజాల సురేందర్, కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం పంపిణీ చేశారు. ఎల్లారెడ్డిలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా సంక్షేమ దినోత్సవం సందర్బంగా మండలంలోని 28 మందికి చెక్కులతో పాటు పట్టు చీరలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గరీబున్నిసాబేగం, సర్పంచ్ బొల్లు లావణ్య, ఎంపీటీసీ దేవెందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ముదాం సాయిలు, పర్వయ్య పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన


పిట్లంలో మాట్లాడుతున్న తహసీల్దార్

పిట్లం: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు తప్పక ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రామోహన్ రావ్ పేర్కొన్నారు. పిట్లంలో మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి ఓటు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఓటరు కార్డుతో పాటు ఓటరు జాబితాలో ఏమైనా తప్పులుంటే సరి చేసుకోవాల ని ఆయన సూచించారు.


లింగంపేటలో రేషన్ డీలర్లకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రాజేశ్వర్

లింగంపేట: రేషన్ షాపులకు వచ్చే యువత కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా తహసీల్దార్ రాజేశ్వర్ రేషన్ డీలర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి లబ్దిదారుడికి రేషన్ బియ్యం అందేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎల్లారెడ్డిరూరల్: బీఆర్ఎస్ నాయకుల అవినీతిని సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ నవీన్ సూచించారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో పలు మండలాలకు చెందిన సోషల్ మీడియా కో ఆర్డినేటర్లకు నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జి సురేష్, వివిధ మండలాలకు చెందిన సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు జహంగీర్, సతీష్, కిరణ్ నాయక్, దేవిసింగ్, రజనికాంత్‌రెడ్డి, అశ్వస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి


మాట్లాడుతున్న కురుమ చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్ తదితరులు

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ గ్రామంలోని బీరప్ప ఆలయాన్ని ధ్వంసం చేసి ఆలయ భూమిని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కురుమ చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కాచాపూర్‌లో అక్రమణకు గురైన బీరప్ప ఆలయ భూమిని పరిశీలించారు. గ్రామానికి చెందిన కొందరు ఆలయ భూమిని కబ్జా చేయాలనే ఉద్దేశంతో అర్ధరాత్రి జేసీబీతో ఆలయాన్ని ధ్వంసం చేశారని ఆరోపించారు. జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు ఎర్రోళ్ల స్వామి, సంగెపు మల్లేశ్, సంగెపు శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల మంజూరు



నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం, ఆత్మకూర్ గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేసిన ఆత్మకూర్ సర్పంచ్ బాల్‌రెడ్డి, పోచారంకు చెందిన సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం కామారెడ్డిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్‌రావు అభినందించారు. దీంతో పాటు వారికి ఆయన అగ్రిమెంట్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రుగ్రామాల పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, రమేష్ ఉన్నారు.

మేనూర్‌కు గ్రంథాలయం..

మద్నూర్: మండలంలోని మేనూర్‌కు గ్రంథలయం మంజూరైనట్లు సర్పంచ్ విఠల్ గురూజీ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేష్ మంజూరు పత్రాన్ని అందజేశారు.

జాతీయ జెండా ఆవిష్కరణ


దోమకొండ గురుకుల పాఠశాలలో జాతీయ జెండాను ఎగుర వేస్తున్న జెడ్పీటీసీ

దోమకొండ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దోమకొండలోని గురుకుల పాఠశాలలో జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద మంగళవారం జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లపు అంజలి, ప్రిన్సిపాల్ శివరాములు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భిక్కనూరు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక గురుకుల పాఠశాలలో శ్రీసిద్ధరామేశ్వరనగర్ సర్పంచ్ జనగామ శ్రీనివాస్ పాఠశాలలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు మానవహారంగా ఏర్పడి రాష్ట్ర ప్రగతి గురించి మాట్లాడారు. ప్రిన్సిపాల్ నర్సింహరెడ్డి, అధ్యాపకులు శ్రీనివాస్, ప్రభాకర్, సత్యనారాయణ, బసవయ్య పాల్గొన్నారు.

మదన్‌హిప్పర్గాకు బస్సు నడపాలి

మద్నూర్: డోంగ్లీ మండలంలోని మదన్‌హిప్పర్గా గ్రామానికి ఆర్టీసీ బస్సులను నడపాలని సర్పంచ్ రాజు పటేల్ మంగళవారం బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. మద్నూర్, డోంగ్లీ మండల కేంద్రాల్లోంచి ఇంత వరకు తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు లేవని దీంతో నిత్యం ప్రైవేటు వాహనాల్లో మండల కేంద్రానికి చేరుకోవాల్సి వస్తుందన్నారు. అత్యవసర సమయాల్లో వాహనాలు లేక కాలినడకన వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి


గాంధారిలో తనిఖీ చేస్తున్న ఏడీఏ రత్న

గాంధారి: విత్తనాలు, పురుగు మందుల వ్యాపారులు, డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, విత్తనాలు తీసుకున్న ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాలని ఎల్లారెడ్డి ఏడీఏ రత్న ఆదేశించారు. లేబుల్లు ఉన్న విత్తనాల బ్యాగులనే విక్రయించాలని, లూజు విత్తనాలను విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. మంగళవారం ఆమె ఏవో నరేష్‌తో కలిసి మండల కేంద్రంలో పలు విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక రైతు వేదిక భవనంలో విత్తనాల డీలర్లు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ

పెద్దకొడప్‌గల్: దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. పెద్దకొడప్‌గల్‌లో మంగళవారం నిర్వహించిన మహిళ సంక్షేమ దినోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ ధఫేదార్ శోభ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి టీచర్లను అభినందించి, గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. అనంతరం మహిళ ఉద్యోగులను సన్మానించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు మహిళలకు 30 శాతం రిజర్వేషన్లు ప్రస్తుతం 50 శాతానికి పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మహిళల కోసం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్టు, అమ్మ ఒడి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు వెల్లడించారు. జెడ్పీ సీఈవో సాయగౌడ్, డీఆర్‌డీఏ రమేష్ బాబు, మిషన్ భగీరథ సీఈవో రామచందర్ నాయక్, ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో రాణి, ఐసీడీఎస్ సీడీపీవో సునంద తదితరులు పాల్గొన్నారు.

రూ. లక్ష కోసం అవస్థలు


రామారెడ్డిలోని మీ సేవ కేంద్రం

రామారెడ్డి: కులవృత్తుదారులకు రూ. లక్ష సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడంతో సంబంధిత సర్టిఫికెట్ల కోసం మీ సేవలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ రోజూ వందలాది మంది తిరుగుతున్నారు. మీ సేవ కేంద్రాల్లో కుల, ఆదాయం సర్టిఫికెట్ల కోసం మండుటెండలో వేచి చూస్తున్నారు. సర్వర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యల కారణంగా లబ్దిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకునేందుకు గడువు విధించడంతో ఆలోగా అన్ని సర్టిఫికెట్లు చేతికందుతాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు శతాబ్ది ఉత్సవాలలో బిజీ బిజీగా ఉంటుండ టంతో సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

నిజాంసాగర్: కులవృత్తుదారులకు రూ. లక్ష సాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు సర్వర్ కష్టాలు తప్పడం లేదు. సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు కోసం మూడు రోజులుగా ప్రయత్నిస్తున్నా సర్వర్ సరిగా పని చేయకపోవడంతో సైట్ ఓపెన్ కావడం లేదని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

20లోగా దరఖాస్తు చేసుకోండి

తాడ్వాయి: బీసీ కులవృత్తులకు చెందిన వారు ప్రభుత్వం ఇవ్వనున్న రూ. లక్ష సాయం కోసం 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజ్‌వీర్ తెలిపారు. ,దరఖాస్తుకు ఆధార్, ఓటరు కార్డు, ఆదాయ, కుల సర్టిఫికెట్, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకంతో పాటు ఫొటోలు జత చేయాలని సూచించారు. 18 నుంచి 55 ఏళ్లలోపు వారు మాత్రమే అర్హులని వెల్లడించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


రాజంపేటలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

రాజంపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంను జెడ్పీటీసీ కొండ హన్మాండ్లు, ఎంఈవో రామస్వామి మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వరూప, సర్పంచ్‌లు స్వాతి, లక్ష్మీ, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు లక్ష్మీనారాయణ, సుమలత, వసంత, సీఆర్పీలు లింగం ,సాయిరెడ్డి, సూర్య పాల్, రమేష్ పాల్గొన్నారు.


నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): విద్యార్థులకు ఎంఈవో దేవిసింగ్ మంగళవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాస్కర్‌గౌడ్, వేణుగోపాల్, వెంకట్రాంరెడ్డి, శరత్‌చంద్ర, రాఘవేందర్ ఉపాధ్యాయులు శ్రీరాం, రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

- 70 సార్లు రక్తదానం చేసిన డాక్టర్ బాలు
- నేడు రక్తదాతల దినోత్సవం



రక్తదానం చేస్తున్న డాక్టర్ బాలు

కామారెడ్డి టౌన్: అపదరలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలుస్తున్నారు కామారెడ్డికి చెందిన డాక్టర్ బాలు. ఆయన ఇప్పటి వరకు 70 సార్లు రక్తదానం చేశారు. అంతేకాకుండా రక్తదాతల సమూహం ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న వారికి, తలసేమియాతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి రక్తం సేకరిస్తుంటారు. బుధవారం అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కథనం. రక్తదాతల సమూహం, రెడ్ క్రాస్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సంస్థల ద్వారా ఆయన రక్తాన్ని సేకరించారు. కరోనా సమయంలో వంద యూనిట్ల ప్లాస్మా, 950 యూనిట్లు రక్తాన్ని సేకరించి పలువురి ప్రాణాలు కాపాడారు. రక్తదాతల సమూహాన్ని 2007లో ఏ ర్పాటు చేసి తద్వారా అవసరమైన గర్భిణులు, ఆప రేషన్‌ల కోసం రక్తం అవసరమైన వారికి సమకూరుస్తుంటారు. ఆరు నెలల్లో 1,073 యూనిట్ల రక్తాన్ని అందజేసి రికార్డు సృష్టించారు. రాష్ట్రపతి, గవర్నర్‌ల చేతుల మీదుగా ఆయన గతంలో అవార్డులను అందుకున్నాడు.

ఆధ్యాత్మికం

■ **బోనమెత్తిన ఎమ్మెల్యే సురేందర్**



ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి పట్టణంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవంలో భాగంగా మంగళవారం బోనాలతో యాత్ర నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే జాజాల సురేందర్ బోనం ఎత్తుకొని స్థానిక జెడ్పీ బాలికల పాఠశాల నుంచి లక్ష్మమ్మ ఆలయం వరకు నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, లింగంపేట జెడ్పీటీసీ శ్రీలత, ఐకేపీ ఏపీఎం ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.

■ **ఘనంగా బోనాల పండుగ**



నాగిరెడ్డిపేట: మండలంలోని ధర్మారెడ్డి, మేజర్‌వాడి గ్రామాల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ధర్మారెడ్డిలోని ముత్యాల పోచమ్మకు రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేజర్‌వాడిలో పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా బోనాలు సమర్పించారు.

■ **హిందూ ధర్మం చాలా గొప్పది**



కామారెడ్డి టౌన్: ప్రపంచంలోనే హిందూ ధర్మం చాలా గొప్పదని కంచి కామకోటి పీఠాధీశ్వరుడు శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి అన్నారు. మంగళవారం కామారెడ్డి పట్టణ శివారులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందూ ధర్మాన్ని ప్రతి కాపాడుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

రైతుబీమా పత్రం అందజేత

పిట్లం: రైతు బీమాకు సంబంధించిన రూ.5 లక్షల విలువ చేసే మంజూరు పత్రాన్ని మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దుత్తకు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం అందజేశారు. దత్తు భార్య లింగమణి ఇటీవల మృతి చెందడంతో నామినీగా ఉన్న ఆమె భర్త బీమా మంజూరు పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విజయ్, శివాజీరావ్, అశోక్‌రావ్, ఏఈవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి



మాచారెడ్డి : మాచారెడ్డి, పాల్వంచ మండలాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావ్ మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. ఎంపీపీ వెంట పౌల్ట్రీ ఫెడరేషన్ నేత చిన్న నర్సింగరావ్ ఉన్నారు.

కుల సంఘ భవన నిర్మాణాలకు ప్రాధాన్యత



దోమకొండ: కులసంఘాల భవన నిర్మాణాలకు తనవంతు సహకారం అందిస్తానని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. రూ. 20 లక్షలతో చేపట్టనున్న దోమకొండలోని పెద్దమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణ పనులకు మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పున్న లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుకున్న బడికి ఫ్యాన్ల వితరణ

బాన్సువాడ రూరల్: తాము చదువుకున్న బడికి ఆగ్రామ యువకులు చిరుసాయం అందించారు. మండలంలోని సంతోష్‌నగర్ తండాకు చెందిన రైజింగ్‌స్టార్ యూత్ సభ్యులు రెండు తరగతులకు రెండు ఫ్యాన్లను విరాళంగా అందించారు. యువకులు చేసిన సాయం చిన్నదైనా ప్రతి ఒక్కరు తాము చదువుకున్న పాఠశాలకు ఏదోవిధంగా సాయం అందించాలనే తాపత్రయం కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయులు హీరాలాల్ అన్నారు. ఈకార్యక్రమంలో మహేష్, వినోద్, యువరాజ్, రాహుల్, పండరి తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలను అరికట్టండి

పెద్దకొడప్‌గల్: మండలంలోని కాటేపల్లి గ్రామంలో మిషన్ భగీరథ పైప్ లీకేజీతో తాగు నీరు కాలుషతమై ఆనరోగ్యలకు గురవుతున్నమని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబందిత అధికారులు స్పందించి లీకేజీ లేకుండా మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

కళాశాల కోసం మంత్రి కేటీఆర్‌కు లేఖలు



బీబీపేట: మండల కేంద్రమైన బీబీపేటకు జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం పలు విద్యార్థి సంఘాల నాయకులు మంత్రి కేటీఆర్‌కు లేఖలు రాశారు. రెండేళ్ల కిందట పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జూనియర్ కళాశాల మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్లయినా కళాశాల ప్రస్తావన లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని బంజపల్లి పంచాయతీలో మంగళవారం మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళాదినోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్బంగా పంచాయతీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులను పంచాయతీ కార్యదర్శి గంగారాం సన్మానించారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు సునిత, అనిత, ఎలిజబెత్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

50వ రోజుకు చేరిన నిరసన దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ప్యాక్టరీ నుంచి విడుదలయ్యే వ్యర్థాల వల్ల కల్గుతున్న ఇబ్బందుల నుంచి రక్షించాలని డిమాండ్ చేస్తూ కాచాపూర్‌లో చేపట్టిన నిరసన దీక్షలు 50వ రోజుకు చేరుకున్నాయి. వారికి మద్దతుగా మంగళవారం పలువురు యువకులు నిరసన దీక్షలో కూర్చొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా ఉచిత బోధన

కామారెడ్డి అర్బన్: సంస్కృతంలో మాట్లాడాలనే ఆసక్తి ఉన్న వారికి 15వ తేదీ నుంచి సంస్కృత భారతి సంస్థ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రతినిధి సింహచలం తెలిపారు. శిక్షణ కోసం 14లోగా 90303 80814 నంబర్ వాట్సాప్ గ్రూప్‌లో జాయిన్ కావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మద్నూర్: మండల కేంద్రంలోని బాలుర గురుకులంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు కెమిస్ట్రీ, ఫిజికల్ సైన్స్ బోధించేందుకు తాత్కాలిక పద్ధతిన పని చేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సురేందర్ కోరారు. అభ్యర్థులు 17న ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో డెమోకు హాజరు కావాలని సూచించారు.

వసతి గృహంలో అడ్మిషన్లు ప్రారంభం

రామారెడ్డి: మండల కేంద్రంలోని షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహంలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు వసతి గృహ సంక్షేమ శాఖ అధికారి జైపాల్ తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 99082 51388 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఐటీఐలో అడ్మిషన్ల కోసం గడువు పొడిగింపు

బిచ్కుంద: ఐటీఐలో అడ్మిషన్ల కోసం 19వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ వెంకట శివరావు తెలిపారు. జిల్లాలోని రెండు ప్రభుత్వ, మూడు ప్రైవేట్ ఐటీఐల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తామన్నారు.

నేడు బాన్సువాడకు స్పీకర్ రాక

బాన్సువాడ : బాన్సువాడ పట్టణంలో బుధవారం నిర్వహించనున్న ఆరోగ్య దినోత్సవానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్నారని ఆత్మ కమిటీ చైర్మన్ మోహన్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

నేడు ఆరోగ్య దినోత్సవ వేడుకలు

కామారెడ్డి టౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ అధ్వర్యంలో బుధవారం ఆరోగ్య దినోత్సవం వేడుకలను నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్ సింగ్ తెలిపారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్‌లో వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేపట్టాలి

నాగిరెడ్డిపేట: ఉపాధి కూలీలు నిబంధనలకు అనుగుణంగా కొలతల ప్రకారం పనులు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. మండలంలోని బంజరతాండ శివారులో కూలీలు చేపట్టిన ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్బంగా కూలీల హాజరుకు సంబంధించిన మస్టర్లను ఆయన తనిఖీ చేశారు. దీంతో పాటు కూలీలతో ఆయన మాట్లాడారు. కూలీలు సమయపాలన పాటిస్తూ పనులు చేయాలన్నారు. రోజు రూ.275 కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు చేపట్టాలని ఆయన చెప్పారు. పనిప్రాంతంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి మమత ఉన్నారు.